
ప్రజాశక్తి
సోమవారం 30 డిసెంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు



రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



ప్రజాశక్తి-చింతపల్లి: రాష్ట్ర స్థాయి కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గోపి నాయక్ చాందిని ఎంపికైనట్లు జిల్లా కోఆర్డినేటర్ పి.రమణ మూర్తి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదోవ తరగతి చదువుతున్న గోపి నాయక్ చాందిని మండల, జిల్లా స్థాయి కౌశల్ సైన్స్ క్విజ్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిందన్నారు. ఈనెల 30న విజ యవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ అర్కిటెక్చర్లో జరిగే రాష్ట్ర సాయి క్వీజ్ పోటీలకు హాజరు కానుందన్నారు. రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక కావడంపై ప్రధానోపాధ్యాయులు వీరభద్రరావు. ఉ పాధ్యాయులు చిట్టినాయుడు, సన్యాసిరావు. ప్రకాశ్రావులు విద్యార్థిని అభినందించారు.

ఆరుబయటే చదువులు!

-అవస్థలు పడుతున్న విద్యార్థులు -మధ్యలో నిలిచిన పాఠశాల భవనం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పాతకోట పంచాయతీ ఎగరూడి గ్రామంలో పాఠశాల భవనం లేక రేకుల షెడ్డులో ప్రస్తుతం విద్యా బోధన సాగుతోంది. ఈ పాఠశాలలో 23మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. నాడు నేడులో భాగంగా 2022-23 సంవత్సరంలో రూ.23 లక్షలు పాఠశాల నిర్మాణానికి మంజూరు అయ్యాయి. ఇంటర్ లెవెల్ వరకు నిర్మించి మధ్యలో ఆగి పోయింది. దీంతో వరండాలో విద్యా బోధనలు సాగు తున్నాయి.

పెట్టుగోడలు గ్రామం నుంచి ఎగరూడిలో ఉన్న పాఠశాలకు 4 కిలో మీటర్లు నడిచి విద్యార్థులు వస్తున్నారు. రోడ్డు సౌకర్యం లేక బడికి పోవడానికి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. మార్గ మధ్యలో జంతువులు దాడి చేస్తాయోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. గ్రామం ఏర్పడి సుమారు 50 ఏళు అవుతున్నప్పటికీ గ్రామంలో సీసీ రోడ్డు చేపట్టలేదు. గ్రామానికి కనీసం మట్టి రోడ్డు కానరాలేదు. వర్షాలకు పాఠశాల రేకుల షెడ్డు కూడా కారిపోతోంది. అధికారులు స్పందిచి తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించి, పాఠశాల నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



కింద కూర్చుని చదువుతున్న విద్యార్థులు



అసంపూర్తిగా పాఠశాల



రేకుల షెడ్డులో ఉన్న పాఠశాల



వ్యాపారులతో మాట్లాడుతున్న జికె.వీధి సిఐ వరప్రసాద్, చిత్రంలో ఎస్ఐ రవీంద్ర

గిరిజనులను మోసగిస్తే కఠిన చర్యలు

- గంజాయి సాగు, రవాణాను ప్రోత్సహిస్తే కేసులు
- వ్యాపారులకు జికె.వీధి సిఐ వరప్రసాద్ హెచ్చరిక

ప్రజాశక్తి -సీలేరు

గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారిని మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని అపరాల వ్యాపారులను జీకే వీధి సీఐ వరప్రసాద్ హెచ్చరించారు. జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్లో ఆదివారం ఉదయం అపరాల వ్యాపారులతో సిఐ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరాల వ్యాపారులు మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనులు పండించిన ఉత్పత్తులను కొనుగోలు చేసేటప్పుడు వేయింగ్ కాటాలతో మోసాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అపరాలు ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తామని ఆశ చూపి తప్పుడు తూనికలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోందని, అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. గంజాయి అక్రమ రవాణా, గంజాయి సాగుకు గిరిజనలు స్వస్తి పలికేలా వ్యాపారులు వారిని చైతన్యవంతులు చేయాలని సూచించారు. గిరిజనులకు అపరాల వ్యాపారులకు సత్సంబంధాలు ఎక్కువగా ఉంటాయని, వారికి అధిక లాభాలు సమకూర్చే వివిధ రకాల పంటలపై అవగాహన కల్పించి ఆయా పంటలు పండించే విధంగా ప్రోత్సహించాలని కోరారు. గంజాయి అక్రమ రవాణా సాగు చట్టరీత్య నేరమన్నారు. అమాయక గిరిజనులను గంజాయి అక్రమ రవాణాకు గంజాయి సాగుకు ప్రోత్సహిస్తే ఉపేక్షించేది లేదని, కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అధిక లాభాలు వచ్చే పాలఉత్పత్తులపై గిరిజనులకు అవగాహన కల్పించి వాటి మెలుకులు తెలియజేయాలని వ్యాపారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై కే రవీంద్ర, స్థానిక ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, వ్యాపారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట

పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్- -రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: ఆంధ్రాఊటీ అరకులోయలో సందర్శకుల సందడి ఆదివారం నెలకొంది. ఘాట్రోడ్లో వాహనాలు బారులుతీరాయి. సుంకరమెట్ట కాఫీ తోటలు, గాలికొండ వ్యూపాయింట్, గిరిజన మ్యూజియం, పద్మావతి గార్డెన్, తదితరాలు పర్యాటక కేంద్రాలు రద్దీగా మారాయి. అతిథిగృహాలు, హెూటళ్లు పూర్తిగా నిండిపోయాయి. మంచు అందాలను తమ కెమెరాల్లో బంధించేందుకు సందర్శకులు ఆసక్తి చూపించారు. కాఫీ తోటల్లో అధిక సమయం వెచ్చించారు.వన భోజనాలు చేస్తూ ఆనందంగా గడిపారు.ప్రముఖ పర్యాటన కేంద్రమైన అరకులోయలో పర్యాటక కేంద్రాలు వీక్షించేందుకు పర్యాటకులు అధికంగా తరలి వచ్చారు.



అరకులోయలో మ్యూజియం వద్ద పర్యాటకులు

అరకులోయ మండలం సుంకరమెట్ట సమీపంలో కాఫీ ప్లాంటేషన్, వ్యూ పాయింట్ వద్ద గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో కిలో మీటర్ల పొడవున వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. పోలీస్ సిబ్బంది, వాలంటీర్లు ట్రాఫిక్ను క్లియర్ చేశారు. దీంతో రాకపోకలు యధావిధిగా కొనసాగాయి. కాఫీ ప్లాంటేషన్ వీక్షించేందుకు దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులు రోడ్డుపై వాహనాలు ఆపుతుండటంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని స్థానికులు చెబుతున్నారు. ఏపీజీ.. అనంతగిరి కాఫీ ప్లాంటేషన్ లో గంటల తరబడి నిలిచిపోయిన వాహనాలు

అనంతగిరి: నూతన సంవత్సర వేడుకలు దగ్గర పడుతున్న తరుణంలో ప్రముఖ పర్యాటక కేంద్రాలకు వేలాది మంది పర్యాటకులు వారం రోజుల నుండి క్యూ కడుతున్నారు. బొర్రా గుహలు, శివలింగపురం, డమ్ముకు, ములియగూడ, అనంతగిరి, బీసుపురం, సుంకరమెట్ట, అరకు కాఫీ ప్లాంటేషన్లో పర్యాటకుల సండి నెలకొంది. ఘాట్ రోడ్డు ఇరువైపులా వాహనాలు నిలిచి పోవడంతో రాకపోకలకు గంటల తరబడి ఆలస్యం ఏర్పడింది.



డుంబ్రిగుడ మండలం చాపరాయి వద్ద పోటెత్తిన పర్యాటకులు



కాఫీ ప్లాంటేషన్ వద్ద నిలిచిన వాహనాలు

డుంబ్రిగుడ: మండలంలో పర్యాటక ప్రదేశాలైన చాపరాయి జలపాతం, అంజోడ సిల్క్, అరకు పినారిలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో కిటకిటలాడాయి. చాపరాయి జలపాతంలో సరదాగా జారుకుంటూ స్నానాలు చేస్తూ పర్యాటకులు ఆనందంగా గడిపారు. అరకు పినారిలోని అందమైన ఎత్తయిన చెట్లు మధ్యన ఫోటోలు తీయించుకుంటూ పర్యాటకులు సందడి చేశారు. గత మూడు రోజుల నుంచి ఈ పర్యాటక ప్రదేశాల్లో అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి వస్తుండడంతో పర్యాటక ప్రదేశాలన్నీ వాహనాలతో కిటకిటలాడుతున్నాయి. చాపరాయి జలపాతం వద్ద అధిక సంఖ్యలో వాహనాలు రావడంతో ట్రాఫిక్ స్తంభించింది. రోడ్డుకి ఇరువైపులా అడుగడుగునా వంటలు చేసి వన బోజనాలు చేస్తూ ఆటపాటలతో పర్యాటకులు సందడి చేస్తూ ఆనందంగా గడిపారు.



వెంకటేశ్వరసామి ఆలయం వద్ద జెసి అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, కుటుంబ సభ్యులు

వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న జెసి, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలోని ఐ.పోలవరం వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ కుటుంబ సభ్యులతో ఆదివారం సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు నారాయణ రాజు, సిబ్బంది గోవిందగిరి శ్రీవారి సేవక బృందం (కో-ఆర్డినేటర్) నల్లమిల్లి వెంకట రామారెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్ధ ప్రసాదాలను అందజేశారు.



రగ్గులు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో

గిరిజనులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు మారుమూల పివిటిజి గ్రామాల్లో గిరిజన కుటుంబాలకు సొసైటీ కార్యవర్గం ఆదివారం రగ్గులను పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ ఎస్ గంగరాజు, ప్రధాన కార్యదర్శి జి గౌరీ శంకర్రావు మాట్లాడుతూ.. పాడేరు మండలం గొండెల్లి పంచాయితీ మారుమూల బొడ్డ పుట్టు గ్రామంలో పేద గిరిజనులకు, వృద్ధులకు, మహిళలకు రగ్గులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంతంలో చలి ఎక్కువగా ఉండడంతో వృద్ధులు చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్నారని, తగ్గిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో గిరిజనులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా ఆస్పత్రికి వెళ్లి చూపించుకోవాలన్నారు. ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. గంజాయి, మద్యం వంటి వాటి జోలికి పోవద్దని సూచించారు. తాగునీరు మరగపెట్టి తాగాలని సూచించారు. అంతకుముందు పాడేరు ఆసుపత్రిలో రక్త నిధి కేంద్రంలో రక్తపు నిలువలు వాటి వినియోగంపై తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పి.సూర్యారావు, జిల్లా కోఆర్డినేటర్ వి.లోహితస్, సభ్యులు జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సంతవలసలో అపారిశుధ్యం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని గుంటసీమ రోడ్డు సంత వలస వీధిలో రోడ్డు పక్కనే ప్లాస్టిక్ కవర్లు, చెత్తా చెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉండడంతో ఆ వీధిలోని గిరిజనులు పలు ఇబ్బందులు పడుతున్నారు. గుంటసీమ రోడ్డుకు అనుకుని చెత్తాచెదారం ఉండడంతో వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరంతా నిల్వ ఉండి దుర్వాసన వస్తుంది. దోమలు వృద్ధి చెందుతున్నాయని గిరిజనులు తెలిపారు. ఈ రోడ్డు మీదుగానే పీహెచ్సీ, గవర్నమెంట్ హై స్కూల్, ఆశ్రమ బాలురు పాఠశాల, జూనియర్ కళాశాల ,కేజీబీవీ పాఠశాలలో పనిచేసే ఉద్యోగులు ఉపాధ్యాయులు సిబ్బందితో పాటు విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు పక్కనే అపారిశుధ్యం పేరుకుపోయి దుర్వాసన వస్తుండడంతో వారంతా ఇబ్బందులకు గురవుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి పేరుకుపోయన అపారిశుధ్యాన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు.



సంతలో చెత్తా చెదారం

తాత్కాలిక రేకుల షెడ్లో పాఠశాల

★ వర్షం వస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
★ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు నానా అవస్థలు
★ శాశ్వత భవనం నిర్మించాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి



తాత్కాలిక రేకుల షెడ్డులో విద్యా బోధన సాగిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ బంధవీధి ఎంపీపీ పాఠశాలకు భవనం లేకపోవడంతో తాత్కాలికంగా నిర్మించి రేకుల షెడ్లో పాఠశాలను నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులు వరకు 40 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో ఒకరు రెగ్యులర్ టీచరు, ఒకరు భాషా వాలంటీరు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. పాఠశాలకు శాశ్వత స్కూలు బిల్డింగు లేకపోవడంతో పిల్లలు, ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. గ్రామస్తులు తాత్కాలిక నిర్మించిన రేకులు షెడ్డలో ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నారు. వర్షం వస్తే తాత్కాలిక రేకుల షెడ్డ కారిపోయింది. దీంతో పిల్లలు విద్యాభ్యాసం పొందలేక, పాఠశాలలో ఉండలేక నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రేకుల షెడ్ చుట్టుపక్కల ఎటువంటి రక్షణ లేకపోవడంతో వర్షపు నీరు లోపలికి రావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్న భోజన పథకానికి వంట షెడ్ లేకపోవడంతో పథకం నిర్వాహకులు వర్షా కాలంలో నానా అవస్థలకు గురవుతున్నారు. బంధవీధి గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటిలో ఉపాధ్యాయులు వంటలను తయారు చేసి పిల్లలకు మధ్యాహ్న భోజనాలు పెట్టవలసిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఎన్నో ఏళ్లుగా ఉన్న పాఠశాలకు భవనం ఏర్పాటు చేయకపోవడం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలానికి అనుగుణంగా అన్ని మారుతున్న మారుమూల గ్రామంలో నివసిస్తున్న తమ పిల్లలు తలరాతలు మారడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. మారుమూల గిరిజన గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం విద్య మౌలిక వసతులు కల్పనకు పెద్దపేట వేస్తుందని ప్రకటనలు చేస్తున్నా తప్పా అవి ఎక్కడా ఆచరణకు నోచుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఆ దిశగా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం కారణంగా నేటికీ తమ గ్రామంలో నూతన స్కూల్ భవన నిర్మాణానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఓ, విద్యాశాఖ అధికారులు స్పందించి స్కూల్ భవనం, వంట షెడ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అంబులెన్స్లో ప్రసవం

ప్రజాశక్తి-సీలేరు



అంబులెన్స్లో ప్రసవం చేస్తున్న దృశ్యం

పురిటి నొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణిని శనివారం రాత్రి సీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువై అంబులెన్స్లో ప్రసవం జరిగింది. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ కొత్తపాకల గ్రామానికి చెందిన సీసా నోయన శనివారం రాత్రి 9 గంటల సమయంలో పురిటి నొప్పులతో బాధపడుతుండగా, అదే గ్రామానికి చెందిన ఆశా వర్కర్ రెడ్డి గణితమ్మ వెంటనే సీలేరు భవ్య ఆసుపత్రికి ఫోన్ చేసి అంబులెన్స్ పంపాలని కోరారు. వెంటనే ఆసుపత్రి సిబ్బంది స్పందించి అంబులెన్స్ను కొత్త పాకల గ్రామానికి పంపించారు. గర్భిణి సీసా నోయనను అంబులెన్స్లో సీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, సీలేరుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఐస్ గెడ్డ దగ్గరికి వచ్చేసరికి పుట్టునొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో అంబులెన్స్ డ్రైవర్ గణేష్ ఈఎంటి రవిచంద్ర అంబులెన్స్లోనే సహాయక చర్యలు చేపట్టారు. రాత్రి 10 గంటల సమయంలో సీసా నోయన పండింట బిడ్డను జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను అంబులెన్స్లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గర్భిణికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటిస్తూ ఆసుపత్రికి తరలించిన డ్రైవరు గణేష్, ఈఎంటి రవిచంద్రను పలువురు అభినందించారు.

తుపాన్కు దెబ్బతిన్న మినప పంట

నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకోలు

ప్రజాశక్తి-సీలేరు

ఇటీవల తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు జికె.వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పరిధిలో మినప, రాగి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సీలేరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపు గ్రామానికి చెందిన వంతల గెన్ను గ్రామ శివారులో మూడు ఎకరాలకుపైగా మినప పంట వేశారు. పంట పండిపోవడంతో తుఫానుకు నాలుగు రోజులు ముందు మినప చేనును తీసి పొలంలో ఆరబెట్టారు. ఇంతలోనే తుపాన్ కారణంగా వర్షాలు కురవడంతో పొలంలో ఆరబెట్టిన మినప చేను పూర్తిగా తడిసి ముద్దయింది. మినప కాయలు మొలకలు రావడంతో చేతికొచ్చే పంట పూర్తిగా పాడైపోయింది. దీంతో బాధిత రైతు వంతల గెన్ను లబోదిబోమంటున్నాడు. విత్తనాలు కొని పెట్టుబడులు అధికంగా పెట్టి మినప పంట పండిస్తే ఫలసాయానికి వచ్చే సమయంలో అకాల వర్షాలు కొంపముంచాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులంతా ఎండనకా, వాననకా కష్టించి పంట పండిస్తే అకాల వర్షాలు తమను దెబ్బతీశాయని, చేసిన అప్పులు ఎలా తీర్చాలని తెలియడం లేదని గెన్ను వాపోయారు. ఎకరాకు పైకి రాగులు పంట కూడా వర్షానికి దెబ్బతిందని, ఈ ఏడాది తిండి గింజలు కూడా లేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట పొలాలను సందర్శించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఆర్థికంగా తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధిత రైతు గెన్ను విలేకరుల ముందు మొరపెట్టుకున్నాడు.



వర్షానికి దెబ్బతిన్న పంటను చూపుతున్న గెన్ను, ఆయన భార్య

ఇంటిపై ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

ప్రజాశక్తి -అనంతగిరి: మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఓ ఇంటి స్లాబ్ పై ప్రమాదకరంగా విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ఇలా ఉన్నప్పటికీ రాష్ట్ర మాజీ మంత్రి, జీసిసి చైర్మన్ కిడారి. శ్రావణ్ కుమార్‌లు ఎండలో ఆరవేసిన కాఫీ పళ్లను పరిశీలించేందుకు వెళ్లడం విశేషం. ఎగువసభ పంచాయితీ పరిధి మరదగుడ గ్రామానికి చెందిన గెమ్మెల. చిన్నారావు ఇంటితో తో పాటు మరో మూడు ఇళ్లపై ఈ విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ఇంటి స్లాబ్ పై గిరిజనులు కాఫీ పళ్ళు కాకుండా పప్పు దినుసులు, ఆహార పదార్థాలు కూడా ఆరవేస్తుంటారు. చిన్న పిల్లలు ఆడుకునేందుకు నిత్యం స్లాబ్ లపై ఎక్కుతుంటారు. దీంతో, ఎప్పుడు ఏమి జరుగుతుందోననే భయాందోళనతో గ్రామస్తులంతా బిక్కుబిక్కు మంటున్నారు. ఇప్పటికైనా స్థానిక విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఆ ఇంటి పై ఉన్న విద్యుతు వైర్లు మార్చి వేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు



ఆధార్ నమోదు చేస్తున్న నిర్వాహకుడు

అంగన్‌వాడీ కేంద్రంలో ఆధార్ కేంద్రం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో సున్న నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి నమోదు చేస్తున్నట్లు నిర్వాహకుడు ఎస్ దేవదాసు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ నమోదు చేసుకోని ఐదేళ్ల లోపు చిన్నారులు ఈ అంగన్వాడి కేంద్రంలో సందర్శించి నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకోవడానికి వచ్చిన వారు ఫోన్ నెంబర్ 8500291699ను సంప్రదించాలని ఆయన కోరారు.

'రాజ్యాధికారం ద్వారానే బిసిల సమస్యలకు పరిష్కారం'



మాట్లాడుతున్న బొంగు ప్రసాద్ గౌడ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాజ్యాధికారం ద్వారానే బిసిల సమస్యలు పరిష్కారమవుతాయని బ్లూ ఇండియా పార్టీ అధ్యక్షులు బొంగు ప్రసాద్ గౌడ్ అన్నారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వార్డు మెంబర్ నుంచి పార్లమెంటు మెంబర్ వరకు జరిగే అన్ని ఎన్నికలలో జనాభా దామాషా ప్రకారం అన్ని వర్గాలకు అవకాశాలు కల్పించాల్సి ఉందన్నారు. కాంగ్రెస్, బిజెపి, తెలుగుదేశం, వైసిపిలు ఓసిల చేత స్థాపింపబడిన కారణంగా అవి అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, ఆ సామాజిక వర్గాల ప్రయోజనాల కోసం మాత్రమే పనిచేస్తున్నాయని విమర్శించారు. ఒబిసికి చెందిన నరేంద్ర మోడీ ప్రధానిగా ఉన్నా బిసిలకు, ఒబిసిలకు న్యాయం జరగకపోవడానికి కారణం బిజెపి అగ్రవర్ణాల పార్టీ కావటమేనని ఆరోపించారు. వృత్తుల ఆధునీకరణ, పారిశ్రామికరణ, ఆర్థిక వెసులుబాటును కల్పించే ప్రణాళికలు తయారుకావడంలేదన్నారు. బిసిలకు దక్కాల్సిన వాటాను ఒసి సామాజిక వర్గాలు అన్ని రంగాలలో లాక్కుంటున్నాయని ఆరోపించారు. అందుకోసం జనగణన జరిపి, ఆ లెక్కల ఆధారంగానే అన్ని రంగాల్లో వాటా కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బిసిలు రాజకీయ చైతన్యమై ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలను కలుపుకొని రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని విజ్ఞప్తి చేశారు. తెలుగు రాష్ట్రాల్లో 2029లో అధికారమే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో బ్లూ ఇండియా పార్టీ ఉపాధ్యక్షుడు అమీనోద్దిన్, ప్రధాన కార్యదర్శి కామేట భూపాల్, కార్యదర్శి బానోతు లింగన్న, నాయకులు మధు భూంపల్లి, రావణ్, రాంబాబు, సందీప్ గౌడ్, కొత్త జంగయ్య గౌడ్, అయినవెల్లి నారాయణ గౌడ్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి -మధురవాడ : పాఠశాల దశ నుంచే క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాచ్చునివిద్యార్థులు నగర పోలీస్ కమిషనర్ శంకబత్ర బాగ్చి సూచించారు. . ఆదివారం కొమ్మాది కూడలి దరి కృష్ణవికాస్ విజయం స్కూల్ వార్షికోత్సవంలో మాట్లాడుతూ కృషి, పట్టుదల, క్రమశిక్షణతో విద్యను అభ్యసించేలా విద్యార్థుల తల్లిదండ్రులు పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్ధేశించుకుని, దాన్ని చేరుకోడానికి కృషి చేయాలన్నారు.అలాగే పోలీస్ శాఖ తరుపున ఎటువంటి సహాయసహకారాలు కావాలన్నా నేరుగా తనను సంప్రదించాలని సూచించారు.

ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ తమ పాఠశాలలో నాణ్యత, నైపుణ్యత కలిగిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సాధించిన విజయాలను వివరించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు పోలీస్ కమిషనర్ బహుమతులు అందించారు. సంస్థ చేపట్టిన విద్య, వైద్యం తదితర వివరాలను ప్రతినిధులు దాసరి మురళీకృష్ణ, వివేక్ దాసరి వెల్లడించారు. పోలీస్ కమిషనర్‌ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే గంటా పరామర్శ

ప్రజాశక్తి -తగరపువలస : కుమార్తె కాపురం కుదుట పడకపోవడాన్ని జీర్ణించుకోలేక మనస్తాపంతో బలవన్మరణానికి పాల్పడ్డ భీమిలి మండలం టి నగరపాలెం పంచాయతీ, గొల్లలపాలెం గ్రామానికి చెందిన బొట్టా శ్రీనివాసరావు కుటుంబాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని, అధైర్య పడొద్దని మృతుని భార్య, కుమార్తెకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గంటా వెంట టిడిపి మండల అధ్యక్షులు డి ఎఎన్ రాజు, పార్టీ నాయకులు పొట్నూరు రాము, టి వెంకటరమణ పాత్రుడు, పల్లా అప్పారావు, పూసర్ల రామారావు ఉన్నారు.ఈ సందర్భంగా మృతుని చిత్రపటం వద్ద ఎమ్మెల్యే గంటాతోపాటు స్థానిక టిడిపి నేతలు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

జనసేన ఇన్చార్జి సందీప్ పరామర్శ

మృతుని కుటుంబాన్ని జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లి పరామర్శించారు.అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కిమ్స్ ఐకాన్, మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రులకు
విఎంఆర్‌డిఎ నోటీసులు

ప్రజాశక్తి -సీతమ్మధార/ ఎంవిపి కాలనీ : సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి విఎంఆర్‌డిఎ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిని మూడు నెలల క్రితం టేకోవర్ చేసుకున్న కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి యాజమాన్యం, గతంలో ఎన్‌ఆర్‌ఐతో కుదిరిన ఒప్పందం మేరకు 20 శాతం మంది వరకు రోగులకు ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, విఎంఆర్‌డిఎ కమిషనర్‌లకు ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు రాసిన లేఖపై అధికారులు స్పందించి ఈ మేరకు నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోగా దీనిపై వివరణ ఇవ్వాలని కోరారు. ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిక చదరపు గజం రూ.270 చొప్పున అతి తక్కువ ధరకు 270 చదరపు గజాల భూమిని కేటాయించారని, ఇపుడు అక్కడ చదరపు గజం ధర రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. అలా ఒప్పందం మేరకు కేటాయించిన స్థలంలో ఏర్పాటైన ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిలో ఉన్న 300పడకల్లో ఒప్పందం మేరకు 60బెడ్లను ఉచిత వైద్యసేవల కోసం కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి యాజమాన్యం కూడా కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ యాజమాన్యం ఒప్పందాలను ఉల్లంఘించి, ఉచిత వైద్య సేవలను నిలిపేసిన నేపథ్యంలో ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రి తరహాలోనే నిర్మితమైన ఎంవిపి కాలనీలోని మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రికి విఎంఆర్‌డిఎ నోటీసులు జారీ చేసింది. కేటాయించిన స్థలంలో రెండేళ్లలో ఆసుపత్రి నిర్మాణం, 20శాతం మంది పేదలకు ఉచిత వైద్యం, 15ఏళ్లలోపు హక్కుల బదలాయింపుపై నిషేధం తదితర నిబంధనలతో స్థలాన్ని కేటాయించగా, షరతులు అతిక్రమణల ఫిర్యాదుపై వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని విఎంఆర్‌డిఎ నోటీసులు జారీ చేశారు. స్పందించకుంటే చర్యలుంటాయని చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ హెచ్చరించారు

గంజాయి సాగుకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి -చింతపల్లి: ఆదివాసీలు గంజాయి సాగు, రవాణకు దూరంగా ఉండాలని స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం పెదబరడ గ్రామ పంచాయతీలో గిరిజనులతో ఆయన సమావేశమయ్యారు.గంజాయితో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, గంజాయితో యువత విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. గంజాయితో గిరిజన ప్రాంతానికి చెడ్డపేరు వస్తుందన్నారు. గంజాయితో పట్టుబడిన వ్యక్తుల ఆస్తులను సైతం జప్తు చేస్తామన్నారు. గిరిజనులు గంజాయి వ్యాపారులకు సహకరించరాదని, సాగు, రవాణను పూర్తిగా విడిచిపెట్టాలని తెలిపారు.ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చినా సమీపంలోనున్న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చునన్నారు. గ్రామాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పోలీసులు గుర్తించి సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

అబ్బురపరిచిన నావికా దళ విన్యాసాలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖ వేదికగా 2025 జనవరి 4న నిర్వహించనున్న నేవీ డే వేడుకలను పురస్కరించుకొని సన్నాహక విన్యాసాలు రెండో రోజు ఆదివారం కూడా బీచ్ రోడ్‌లోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వేదికగా నిర్వహించారు. రెండో రోజు సన్నాహక విన్యాసాల్లో భాగంగా హెచ్‌కె.బాంబింగ్, మార్కస్ డెమో, హీలో ల్యాండింగ్ డెమో, హెచ్‌కె డెమో, ఏంజెల్ డెమో, ఎస్ఎఆర్ డెమో, హార్న్ పైప్ డాన్స్, కంపోసిట్ ఫ్లై పాస్ట్, బీటింగ్ రిట్రీట్ అండ్ సన్ సెట్ సెర్మనీ, సెర్మోనియల్ సన్ సెట్‌తో పాటు కంటిన్యూటీ డ్రిల్ వంటి విన్యాసాలు, ప్రదర్శనలు తూర్పు నావికాదళంలోని అనుభవజ్ఞులైన అధికారులు ప్రదర్శించారు. చివరిలో నౌకలను ప్రకాశవంతం చేస్తూ నిర్వహించిన లేజర్ షో సందర్శకులను ఆకర్షించింది. ఈ వేడుకలకు సంబంధించి 2025 జనవరి 2న నిర్వహించే ఫుల్ డ్రెస్ డెమో రిహార్సల్స్‌కు తూర్పు నావికాదళ విభాగాధిపతి హాజరవుతారని, 2025 జనవరి 4 నిర్వహించే వేడుకలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు హాజరవుతారని అధికారులు తెలిపారు. ఈ విన్యాసాలను వీక్షించాలనుకునే నగర ప్రజలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఏర్పాట్లలో సహకరించిన విఎంఆర్‌డిఎ, జివిఎంసి, పోలీస్ విభాగాలకు, జిల్లా అధికార యంత్రాంగానికి నేవీ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన ఐటిడిసి ముగింపు ప్రదర్శనలు



నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : మూడు రోజులుగా విశాఖపట్నం కేంద్రంగా నటరాజ్ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిన రంగ విక్రమ్ గౌడ్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అంతర్జాతీయ సంప్రదాయ నృత్యోత్సవ సదస్సు-2024 (ఐటిడిసి) ఆదివారం సాయంత్రం బీచ్ రోడ్‌లోని ఎంజిఎం గ్రౌండ్స్ వేదికగా ముగిసింది. ముగింపు కార్యక్రమాలను ప్రఖ్యాత ఆంధ్రనాట్య నిపుణుడు కళా కృష్ణ ప్రారంభించారు. 1800 మంది కళాకారులతో చేపట్టిన బ్రహ్మాంజలి మహా బృంద నృత్య ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. హైదరాబాద్‌కు చెందిన సందీప్ కుమార్ బృందం ప్రేరణ నాట్య ప్రదర్శన, హైదరాబాద్ కళాకృతి కళాకారులు ప్రదర్శించిన కావడి, కరగ నృత్య ప్రదర్శనలు అలరించాయి. కోల్‌కతాకు చెందిన అనూరేఖాఘోష్ బృందం ప్రదర్శించిన కథక్, కేరళకు చెందిన సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత అనుపమ మోహన్ కూచిపూడి, ఒడిశాకు చెందిన డాక్టర్ సుజాత మహాపాత్ర బృందం ప్రదర్శించిన ఒడిసి నాట్య ప్రదర్శన ప్రేక్షకులను కట్టిపడేసింది. చివరిగా తెలంగాణ సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత పి.రమాదేవి కూచిపూడి నృత్య ప్రదర్శనతో పాటు ఢిల్లీకి చెందిన విఆర్ వన్ బృందం వీల్ చైర్లపై ప్రదర్శించిన భరతనాట్యం ప్రేక్షకుల మన్ననలు అందుకుంది అనంతరం పలువురు నిపుణులకు ముఖ్య అతిథులు ద్వారా పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిసి ముఖ్య సలహాదారు వివి.రమణమూర్తి, డైరెక్టర్లు సాయి వెంకటేష్, కాశ్మీరా త్రివేది, జగబంధు జెనా, సజని వల్లభనేని, బాలకృష్ణన్, డాక్టర్ కెవి.సత్యనారాయణ, భారతీ శ్రీనివాస్, కెవి.రమణ తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యావిధానం లక్ష్యం


పూర్వ విద్యార్థుల 'హోం కమింగ్'వేడుకలో గీతం అధ్యక్షుడు శ్రీభరత్



మాట్లాడుతున్న గీతం అధ్యక్షుడు శ్రీభరత్

ప్రజాశక్తి -మధురవాడ : హోం కమింగ్" పేరిట గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ముగిసింది. ఉత్సవాలకు ముఖ్యఅతిధిగా హాజరైన గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ మాట్లాడుతూ, విలువలతో కూడిన విద్యావిధానాన్ని అమలు చేయడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గీతం పూర్వవిద్యార్థులు గీతం విజన్ సాధించడంలో తమ వంతు సహకారం అందించాలన్నారు. గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు విశ్వవిద్యాలయం ప్రగతిని వివరించారు. గీతం ప్రగతిలో పూర్వ విద్యార్థులు పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం స్టూడెంట్ లైఫ్ డీన్ బాలాకుమార్, వివిధ కళాశాలల డీన్‌లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ప్రముఖ సంస్థలలో ప్రతిభను చాటుతూ కీలక స్థానాలకు ఎదిగిన పలువురు గీతం పూర్వ విద్యార్థులను అవార్డులతో సన్మానించారు. పారిశ్రామిక వేత్తగా ఎదిగిన గీతం పూర్వవిద్యార్థి గీతంకు విశిష్ఠ సేవలు అందించిన ఓ.నరేష్ కుమార్, పలాస ఎమ్మెల్యే జి.శిరీష, ప్రముఖ ఎడోబ్ కంపెనీలో బిజినెస్ ఆపరేషన్స్ డైరెక్టర్ జి.గిరీష్, డిజైన్ కన్సల్టెంట్‌గా రాణిస్తున్న ఎమ్. అమిత్‌లను గౌరవించారు. ఈసందర్భంగా గీతంతో తమకున్న అనుబంధాన్ని వారు వివరించారు. సమ్మేళనంలో భాగంగా విద్యార్థుల సాంకేతిక ఉత్పత్తుల ప్రదర్శన, క్రీడా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. గీతం పూర్వ విద్యార్థుల రాకతో ఇంజనీరింగ్, ఫార్మశీ, సైన్స్, మేనేజ్‌మెంట్, దంత వైద్య విభాగాలలో అధ్యాపకులతో ముఖాముఖి నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో సహ హజరు కావడంతో గీతం ప్రాంగణంలో వినోదాన్ని పంచే స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.



పూర్వ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

రోగులకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

కొత్త సంవత్సరంలో నూతన యాక్షన్ ప్లాన్ : కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. ఆదివారం ఆసుపత్రిలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, పవర్ గ్రిడ్ సిఎస్ఆర్ నిధులు రూ.35 కోట్లతో ప్రధాన గేటు వద్ద 50 పడకల సామర్థ్యంతో కొత్త క్యాజువాలిటీ, ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సెంట్రల్ ఎసి , సిటి, ఎంఆర్ఐ మెషన్లతో కూడిన అనుబంధ ల్యాబ్, రేడియాలజీ డయాగ్నోస్టిక్ విభాగంతో అమర్చుతామన్నారు. అదనంగా జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్స్, న్యూరో సర్జరీలకు అనుగుణంగా ఐదు టేబుళ్లతో అత్యవసర ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేస్తామన్నారు..ప్రస్తుతం వివిధ చోట్ల ఉన్న అవుట్ పేషెంట్ కన్సల్టేషన్ గదులను ఒకే చోటకు తెస్తామన్నారు.. తల్లులు పిల్లలకు ప్రత్యేకమైన సంరక్షణకు ప్రత్యేక తల్లి శిశు భవనం ఏర్పాటుచేస్తామన్నారు. రోగుల అవసరాలకు అనుగుణంగా స్పోర్ట్స్ మెడిసిన్, పీడియాట్రిక్, ఆర్థోపెడిక్, స్పైన్ ఇంజురీ, రుమటాలజీ, వాస్కులర్ సర్జరీ,నియోనాటాలజీ, ఫ్యామిలీ మెడిసిన్ విభాగాలు ఉంటాయన్నారు. మార్చురీలో శవాలను భద్రపరచడం కోసం అదనంగా 20 ఫ్రీజర్ బాక్సులు కొనుగోలు చేస్తామన్నారు.. విధి నిర్వహణలో వైద్యులు, సిబ్బంది బాధ్యతతో మెలిగేలా చూస్తామన్నారు. పేద రోగులకు 24 గంటలు అత్యవసర వైద్యం, వ్యాధి నిర్ధారణ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్డియాలజీ, న్యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, న్యూరో సర్జరీ, పీడియాట్రిక్స్, కేన్సర్ చికిత్స వంటి సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు కలెక్టరేట్ నుండి కమాండ్ కంట్రోల్ కోసం కెజిహెచ్ అంతటా ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచామన్నారు. రోగులు వారి కుటుంబాల ఫిర్యాదులకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు 0891- 2590100, 2590102 నెంబర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు వైద్య సేవలు సులభంగా పొందేందుకు టోల్ ఫ్రీ నెంబర్లు 104,15100 ఉన్నాయన్నారు రోగి సంరక్షణ సంబంధాలను పర్యవేక్షణకు ఇద్దరు పబ్లిక్ రిలేషన్స్ అధికారులు 7569898251, 9030 243861 ఫోను నెంబర్లలో అందుబాటులో ఉంటారన్నారు.. ఆహార సహాయం కోసం ఇస్కాన్ రెండు ఆర్ఓ ప్లాంట్లను ఏర్పాటు చేసిందని, బెంచీలతో కూడిన షెడ్ ఏర్పాటు చేశామన్నారు. నిరక్షరాస్యులు కూడా వివిధ వార్డులను సులభంగా గుర్తించేలా కెజిహెచ్ అంతటా రంగు కోడ్‌తో రేడియం లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ల్యాబ్, రేడియాలజీ విభాగాల నుండి అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్ రోగుల మొబైల్స్‌కు నేరుగా డయోగ్నాస్టిక్ నివేదిక పంపడానికి కొత్త సౌకర్యం ప్రవేశపెట్టనున్నట్లు, దీన్ని సాధ్యం చేయడానికి అవసరమైన విధానాలను రూపొందిస్తున్నారు.

40 మంది రక్తదానం

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు 40 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు.విశాఖ బ్లడ్ సెంటర్ సహకారంతో రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు ఎ రాంప్రసాద్, సాయిప్రసాద్, జోనల్ కోఆర్డినేటర్ సత్యసాయి, జిల్లా స్టడీ సర్కిల్ ఇన్‌చార్జి రవిప్రసాద్, సమితి కన్వీనర్ గొట్టిపల్లి సత్య నారాయణ, సమన్వయకర్తలు టివిఆర్ బాబా, సంతోష్, యూత్ కోఆర్డినేటర్ దివాకర్ పాల్గొన్నారు. రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేసిన నిర్వాహకులు వారిని అభినందించారు.

నేరాలు ఘోరాలు

యువతి అదృశ్యం

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని కాశీపట్నం పంచాయతీ గ్రామానికి చెందిన రాళ్లపూడి విజయలక్ష్మి గత వారం రోజుల నుండి కనిపించ లేదని తండ్రి ఉమా మహేష్ తెలిపారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. చుట్టుపక్కల గ్రామాల్లోని కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి గాలించినా ఆచూకీ తెలియ రాలేదని తెలిపాడు. ఆచూకీ తెలిస్తే 9440904224 నెంబర్ కి పోన్ చేయాలని కోరారు

బైక్‌ను ఢీకొట్టిన కారు



నుజ్జయిన కారు

ప్రజాశక్తి -హుకుంపేట: కారు, బైక్ ఢీ కొన్న ఘటన మండలకేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం చోటు చేసుకోంది.ఎస్సై సురేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్దకు ద్విచక్ర వాహనాన్ని ఆపి వాహనదారుడు దిగుతుండగా పాడేరు నుంచి అరకు వైపు వెళుతున్న కారు ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న లాల్ దాష్ గాయపడ్డాడు. క్షతగాత్రులను పాడేరు ఏరియా హాస్పిటల్ తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.



కాలువలో బోల్తా పడిన కారు

కాలువలోకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలంలో ఆదివారం ప్రమాదం చోటుచేసుకుంది. విశాఖపట్నం నుంచి అరకులోయ సందర్శనకు వస్తున్న కారు అదుపు తప్పి బెంజిపుర్, పానిరంగని మధ్య కాలువలోకి దూసుకెళ్లిందని స్థానికులు తెలిపారు.ఈ ప్రమాదంలో కారులో ఉన్న పర్యాటకులకు తీవ్ర గాయాలు కాగా 108లో అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అతివేగంతో వాహనం నడపడంతో ఈ సంఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు.

నర్సీపట్నంలో విషాదం

- తండ్రి చేతిలో కొడుకు దారుణ హత్య

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీ వెంకునాయుడుపేట లక్ష్మీనగర్‌లో కన్నతండ్రి చేతిలోనే కొడుకు దారుణహత్యకు గురైయ్యాడు. టౌన్ సీఐ గోవిందరావు చెప్పిన వివరాలివి.

తండ్రి కొటారి రమణ ఆర్మీలో పనిచేసి రిటైర్ అయ్యాడు. శనివారం రాత్రి తండ్రీకొడుకులిద్దరూ మద్యం తాగారు. మద్యం మత్తులో కుటుంబ వ్యవహారాలకు సంబంధించి తండ్రి కొడుకులిద్దరి మధ్య మాటామాట పెరిగి కొట్టుకున్నారు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న రుబ్బు రాయితో కొడుకు భాస్కర్ (32) తలపై తండ్రి రమణ కొట్టాడు. తీవ్ర రక్తస్రావంతో ఇంట్లోనే కొడుకు భాస్కర్ మరణించాడు. ఆదివారం ఉదయం పనిమనిషి వచ్చాక గానీ విషయం బయటికి తెలియలేదు. నిందితుడు కొటారి రమణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టౌన్ సీఐ గోవిందరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌హెచ్‌జీ మేళాను సందర్శించిన ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎఎస్ఆర్ మైదానంలో జరుగుతున్న స్వయం సహాయక సమూహాల (ఎస్‌హెచ్‌జి) మేళాను ఆదివారం విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్ సందర్శించారు. డిసెంబర్ 25న ప్రారంభమైన ఈ ఐదు రోజుల మేళాలో స్థానిక ఎస్‌హెచ్‌జిలు తయారుచేసిన ప్రత్యేకమైన హస్తకళా ఉత్పత్తులు, రుచికరమైన ఆహార వస్తువులతో ప్రేక్షకులను ఆకర్షిస్తోంది. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, ఎస్‌హెచ్‌జిలకు సాధికారత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలు, కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. ఎస్‌హెచ్‌జి మేళా సమాజంలోని మహిళల ప్రతిభను, పట్టుదలను ప్రతిబింబిస్తోందన్నారు. విశాఖపట్నం అభివృద్ధికి తోడ్పడే స్థానిక కార్యక్రమాలకు పూర్తి మద్దతు ఇస్తామని ఎంపీ శ్రీభరత్ స్పష్టం చేశారు.

నిబంధనలు కచ్చితంగా పాటించాలి

సెంట్రల్ జైలు ఖైదీలతో సిపి శంఖబ్రత బాగ్చీ



సమావేశంలో మాట్లాడుతున్న సిపి శంఖబ్రత బాగ్చీ

ప్రజాశక్తి - ఆరిలోవ : జైలులోని ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగడంతోపాటు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని నగర పోలీసు కమీషనర్ శంకబ్రత బాగ్చి సూచించారు. ఆదివారం ప్రిన్సిపల్ డిస్టిక్ట్ అండ్ సెషన్ జడ్జి ఆలపాటి గిరిధర్, జైళ్ళశాఖ డిఐజితో కలిసి విశాఖ సెంట్రల్ జైలును సందర్శించారు. ఖైదీలతో సమావేశం నిర్వహించారు

. ఈ సందర్భంగా మాట్లాడుతూ జైలు నిబంధనలు ఖైదీలు తప్పనిసరిగా పాటించాలని, జైల్లో ఎటువంటి నిషిద్ధ వస్తువులను వాడకూడదన్నారు. ఎవరైనా నిషేధిత వస్తువులు కలిగి ఉంటే తీవ్రమైన చర్యలు తప్పవన్నారు. రౌడీషీటు ఉన్న ఖైదీలు మంచి ప్రవర్తనపై విడుదలైతే నైపుణ్యాల ఆధారంగా ప్రభుత్వమే ఉద్యోగ అవకాశాలు చూపుతుందన్నారు. జైళ్ళశాఖ డిఐజి ఆర్.రవికిరణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇ-ములాఖత్, ఇంటర్వ్యూలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి ఎం.మహేష్ బాబు, జైలు అధికారులు పాల్గొన్నారు.

జ్యూట్ కార్మికుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - తగరపువలస : చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు రావాల్సిన అన్ని బకాయిలను యాజమాన్యం తక్షణమే చెల్లించాలని చిట్టివలస లేబర్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక లేబర్ యూనియన్ కార్యాలయంలో యూనియన్ సమావేశంలో మాట్లాడుతూ పిఎఫ్, గ్రాడ్యూటీ, నష్టపరిహారం చెల్లించాలని రెండేళ్లుగా కోరుతున్నా యాజమాన్యం మొండిగా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పిఎఫ్, కార్మికశాఖ అధికారులకు ఎన్నిదఫాలుగా విన్నవించినా, నేటికీ పరిష్కారం కాలేదని వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవ తీసుకుని జ్యూట్ కార్మికుల బకాయిలు ఇప్పించేలా కృషి చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు చిల్లరాం పైడి, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, ఎన్ ఆదినారాయణ, అల్లు బాబూరావు పాల్గొన్నారు